

మా పెదనాన్నగారి కాలవి రెండు రాజమార్గాల నడుమ, చుట్టూ గుబురు చెట్లతో, ముళ్ళపొదలతో నిండి ఉంటుంది. వర్షాకాలంలోగాని వచ్చి చూస్తే — చుట్టూ నీళ్ళతో ఓ ద్వీపంలా సాక్షాత్కరిస్తుంది. లోపలకు ఎలా ప్రవేశించడమా అన్న అనుమానం పొడచూపక మానదు. ఆ మాటకొస్తే అక్కడ ప్రవేశమార్గం అంటూ ఏదీ కనిపించదు. అక్కడి వాళ్ళు మార్గం వంటిది తాత్కాలికంగా చేసినా, అది కాస్తా వర్షాకాలంలో తుడుచుకు పోతుంది. అందుకే కొన్నాళ్ళ పరిచయం ఉన్న వాళ్ళు తప్ప, కొత్త వాళ్ళు వదేసి అడుగుంకే కనిపించిన ప్రతి ఒక్కరినీ దారి పొడుగునా అడుగుతూ పోవాలి. మొహమాటపడి, 'ఈ దారి తిన్నగానే వెళుతుందిలే' అని తీర్మానించుకొని, సూటిగా ముందుకుగాని దూసుకు పోయేందుకు ప్రయత్నిస్తే, ఎక్కడో నీళ్ళ మధ్య, ఏదో లోతయిన గుంటలో కాలు జారి, బావలో పడ్డ ఈగల్లా గిలగిలా తన్నుకోక మానరు. బ్రతుకులోని మెట్ట పల్లాలు, గరకు నునుపులు అక్కడ బాహాటంగా కనిపిస్తాయి. కాని, ఇటువంటి చోట కూడా అక్కడి వాళ్ళు ప్రతి ఏడాది జాతర జరుపుతారు. తాము జరుపుకొనే జాతరకు తప్పకుండా రావలసిం దని నెల్లాళ్ళకు ముందుగానే కరపత్రాలు పంచి పెడతారు. ఈ జాతరకు అసలు జనం వస్తారా అని ఆశ్చర్యం కలుగుతుంది. కాని, ఆశ్చర్యం అవసరం లేదు. నిరంతరమూ హృదయంలో వెలిగే దీపం వంటి దైవభక్తితో చుట్టు పక్కల జనం ఏడాది కోసారి అక్కడ సంబరంగా చేరతారు. తెంపులేని అయిదు వేల సంవత్సరాల నాటి సంస్కృతికి నూతనోత్సాహంతో స్వాగత గీతం పలుకుతూ, అమ్మవారి పాదాల చెంత పారవశ్యంతో సాష్టాంగ దండ ప్రణామం చేస్తారు.

సరిగా దారి వెతుక్కుంటూ పెదనాన్న గారి ఇంట్లోకి ప్రవేశించాను. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. పెదనాన్న ఒక్కరూ వాలుకుర్చీలో కూర్చుని పరధ్యానంగా ఆలోచిస్తున్నారు. నన్ను చూసి, "నువ్వటోయ్! రా రా!" అని పిలిచారు. నేను ఆయన దగ్గరకు వెళ్ళి, "పెద్దమ్మ కనిపించదేం?" అని అడిగాను.

"బయటకు వెళ్ళిందిలే! కుర్చీ తెచ్చుకో!" కుర్చీ తెచ్చుకుని కూర్చున్న పిదప "ఈ వేళ నీరసంగా కనిపిస్తున్నారు, పెదనాన్నా!" అని పరామర్శించాను.

"అదా!" ఆయన చిన్నగా నవ్వి, మౌనం వహించారు. జీవం లేని ఆయన చిరునవ్వు నాలో అశాంతిని రగిల్చింది.

"పెదనాన్నా!" మెల్లగా పిలిచాను. ఆయన గట్టిగా నవ్వేందుకు ప్రయత్నిం

చారు. కాని, విందుగా — వెన్నెల్ని కురిపించేలా నవ్వడం అందరికీ సాధ్యం కాదు. ఈ నిజం నాకు బాగా తెలుసు.

"మరేం లేదు. నాకు టి. బి. అని మొన్ననే డాక్టర్ చెప్పారు." టి. బి. మైగాడ్! ఉద్యోగ విరమణ చేసేందుకు సిద్ధంగా ఉన్నారాయన. ఇప్పుడా ఇది రావడం! బహుశా ఇది ఇటువంటప్పుడే వస్తుందేమో కాబోలు! నా గుండెలో రాయి పడింది. హృదయమంతా భారం పేరుకుపోయింది. క్రింద కుర్చీలా కూలిపోతానేమో ననిపించింది. ముఖంమీది చెమట చుక్కల్ని తుడుచుకుంటూ బాధగా పెదనాన్న వేపు చూశాను.

"ఇది మనం అనుకునేంత భయంకరమైందేం కాదోయ్! జాగ్రత్తగా ట్రీట్‌మెంట్ ఇస్తే పూర్తిగా నయమవుతుంది. ఎటొచ్చీ, ఈ ట్రీట్‌మెంట్ చాలా ఖర్చుతో కూడుకున్నది!" నేను బదులివ్వలేదు. నా చూపులు పెదనాన్నగారి మీద ఉన్నా, మనసుమాత్రం ఎక్కడో ఉంది. ఇప్పు డేం చేయాలి? ఈ క్లిష్ట పరిస్థితి నుంచి ఎలా బయటపడాలి? మరో రెండు రోజుల్లో కాలేజీ ఫీజు కట్టివేయాలి. నాకు తెలిసినంత వరకు ఇదే చివరి ప్రయత్నం. ఇంకా చెప్పాలంటే ఇంకిపోకుండా మిగిలి ఉన్న చిట్టచివరి ఆశాబిందువు! నాన్నగారు కూడా కొండంత ఆశ పెట్టుకొని నన్ను ఇక్కడకు పంపించారు. భగవంతుడా! ఇక నేను చేయవలసిం దేముంది? ఇంకే ముంది? చదువు మానివేయాలి. ఎంతటి దురదృష్టకరమైన పరిస్థితి! ఈ మాటే పి. యు. సి. పాసయిన వెంటనే నాన్నతో అన్నాను. "డిగ్రీ చేతనున్నా, లేకపోయినా ఉద్యోగాన్వేషణ తప్పనిసరి. ఆ అన్వేషణ ఇప్పుడే ఎందుకు, నాన్నా, ప్రారంభించ కూడదు?" కాని, ఆయన ఒప్పుకోలేదు.

"ఒరేయ్, చిన్నాడా! నువ్వు చెప్పేది నా కర్థం కాకపోలేదు. నీ బాధ నాకు అర్థమవుతుంది. కాని, నా బాధకూడా నువ్వు అర్థం చేసుకో! ఎంతో ప్రయత్నించాను. ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాను, రెండు డబ్బులు కూడవెయ్యాలని. కాని, ఈ ప్రయత్నంలో నేను పూర్తిగా ఓడిపోయానురా! నా అనంతరం మీకు ఏమీ మిగలదు. ఒకవేళ నువ్వు తీర్చవలసిం దేదైనా ఉండిపోవచ్చు. ఏదో అదృష్టం కలిసివచ్చి గంతకు తగ్గ బొంతలా మీ అక్కయ్య పెళ్ళి అయిందనిపించాను. జీవిత నాటకంలో చరమాంకం సమీపించబోతుందని నా కనిపిస్తోంది. కనీసం నిన్ను పట్టభద్రుణ్ణి చేశానన్న తృప్తి దక్కితే చాలు. నా తృప్తి కోసం నువ్వు చదవాలిరా! ముఖ్యంగా నువ్వు ఒక బ్రిలియంట్ స్టూడెంటువి!" ఆ తరవాత అమ్మకూడా నన్ను పిలిచి నచ్చచెప్పింది.

"నువ్వు ఎందుకు చదువు మానేస్తానంటున్నావో నాకు తెలుసురా! కాని, మీ నాన్నగారి మనసు నొప్పించకు. నువ్వు పుట్టకముందు పెండ్లయిన కొత్తలో ఆయన చదువు సాగించాలని ఎంత ప్రయత్నించారని! కాని, మీ నాన్నగారి ఇష్టప్రకారం ఏదీ జరగలేదు. 'డిగ్రీ సంపాదించలేకపోయానే!' అని ఆయన పడ్డ బాధ నేను మాటలతో చెప్పలేను."

అమ్మా నాన్నల వేదన అర్థం చేసుకొనే చదువు సాగిస్తున్నాను. ఇంతకు ముందుకూడా ఇటువంటి గడ్డు పరిస్థితులు ఎన్నోసార్లు ఎదురయాయి. కాని, ఇప్పటి గడ్డు పరిస్థితి నుంచి బయటపడ్డం మృత్యుద్వారం నుంచి ప్రాణంతో బయటపడ్డం వంటిది!

"ఏంరా, కిట్టూ! ఎప్పుడొచ్చావు?" పెద్దమ్మ గొంతు విని లేచి నిలుచున్నాను.

"వచ్చి ఎంతో సేపు కాలేదు, పెద్దమ్మా!"

"ఉండు, ఇప్పుడే వస్తాను" అని లోపలకు వెళ్ళి రెండు కాఫీ కప్పులతో మళ్ళీ వచ్చింది.

"చూశావురా, కిట్టూ, మా ఇంటి పరిస్థితి! మీ చెల్లి పురుటి ఖర్చులకు తీసిన అప్పు ఇంకా తీరనేలేదు. ఇది ప్రారంభం!" పెద్దమ్మ కంట తడి పెట్టుకుంది. నేను మాట్లాడలేదు. కాఫీకప్పు చేత బట్టుకొని దిక్కులు చూడ నారంభించాను.

నేను మెయిన్‌రోడ్డుమీదకు వచ్చేటప్పటికి సూర్యుడు నిప్పుల్ని వుక్కిరిస్తున్నాడు. చేతి రుమాలు తల మీద పెట్టుకుని బస్సుస్టాండు దగ్గర చాలా సేపు నిలుచున్నాను. అయినా, బస్సు వచ్చే జాడ కనిపించలేదు. అప్పుడు దారిన పోతున్న ఒక సైకిలిస్టు దయ తలచి నా దగ్గిర కొచ్చి ఆగి, "ఇల్లు దగ్గరగా ఉంటే నడిచి వెళ్ళిపొండి, సార్! స్టూడెంట్సుకీ, బస్సు కండక్టర్లకీ జగడం. డ్రైవర్సుకూడా సమ్మె చేస్తున్నారు!" అని తెలియజేసి వెళ్ళిపోయాడు. బరువుగా ఓ నిట్టూర్పు విడిచి, ముఖం మీది చెమట తుడుచుకుంటూ దగ్గరనే ఉన్న టీ దుకాణంలోకి ప్రవేశించాను. స్టూడెంట్సుకి ఇట్లా జగడాలు పెట్టుకునేందుకు తీరిక ఎలా చిక్కుతుందో!

ఉసూరుమని ఓ మూల కూర్చున్నాను. చుట్టుపక్కల చింతచెట్లు ఏపుగా పెరిగి ఉండడం వల్ల అక్కడ గాలి చల్లగా ఉంది. దుకాణంలోని బల్లలమీద పాతకాలం నాటి నునుపైన నల్లరాతి పలకలు అమర్చబడ్డాయి. చిన్న ఇరుకైన ఆ దుకాణంలో, ఆ నల్లరాతి పలకల నునుపైన అందం ఇమడలేక తక్కిడి బిక్కిడిగా తయారయింది. సర్వరుతో ఓ కప్పు టీ తెమ్మని చెప్పి నీరసంగా కళ్ళు మూసుకున్నాను. కళ్ళలో అమ్మ కనిపించింది. కాన్సర్‌వార్డులోని అమ్మ అంతం ఇప్పుడా అప్పుడా అన్నట్టు చూపులు సారిస్తున్నట్టు కనిపించి కళ్ళు


## పాండ్రింకి సుబ్రమణి

చెప్పున తిప్పాను. జీవితం బస్సు ప్రయాణాల వంటిది. ఎక్కడ ప్రమాదంజరుగుతుందో, ఎప్పు డాగిపోతుందో చెప్పడం కష్టం. రేపు పొద్దుట తన పరిస్థితి ఇలా ఉంటుందని నిర్దేశించి చెప్పడం మనిషికి చేతకాకుండా ఉంది. ఇప్పుడే కాదు— ఇకముం దెప్పుడూ చేతకాదేమో? సెకండ్ ఇయర్లోకి ప్రవేశించిన తరవాత అమ్మకు బ్రెస్ట్ కాన్సర్ వచ్చింది. పెదనాన్నగారి కొచ్చిన టి. బి. లా ఇది డబ్బు ఖర్చు చేసినంత మాత్రాన నయమయేది కాదు. మృత్యువు కౌగిలిలో బాగా పట్టుకొని, కుదురుగా కూర్చుని ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. కొత్తలో అలివికాని ఆవేదనతో సతమతమయాము. విషాదాన్ని గుండెల్లో ఇముడ్చుకోలేక, అన్నం సహించక కొన్నాళ్ళు క్రుంగి కృశించిపోయాను. కాని, ఇప్పు డలా కాదు. అన్నీ అలవాటు చేసుకున్నాను. బ్రతుకు యాంత్రికంగా తయారయింది. యాంత్రికంగా చదవడం, ఎదుటివారి దగ్గరినించి యాంత్రికంగా పుస్తకాలు అరువు తెచ్చుకోవడం, అమ్మ ఏడవడం చూసి నేనుకూడా యాంత్రికంగా ఏడవడం అలవాటయింది.

"మూడు రోజుల్నించీ నాకు జ్వరంరా, పావయ్యా! వస్తుంది పోతుంది, వస్తూందీ పోతుందీ!" ఆలోచనల గొలుసుని తెంపుకొని తల పక్కకు తిప్పి చూశాను. నా పక్కనే ఉన్న బల్లచుట్టూ వయసు మళ్ళిన వాళ్ళు నలుగురు ముచ్చటాడుకుంటున్నారు. వాళ్ళలో కాస్తంత అధికంగా వయసు మళ్ళిన ఒకాయన ముగ్గుబుట్ట వంటి తలజుట్టును చేతి వేళ్ళతో మృదువుగా దువ్వుకుంటూ ఇలా అన్నారు:

"ఏ పిచ్చిగానీ—జబ్బు లొస్తున్నాయంటే రావా మరి! మనం తినేదానిలో ఏది కల్తీ లేదు, చెప్పు? బియ్యం కల్తీ, పప్పు కల్తీ, చక్కెర కల్తీ. చివరకు నువ్వు తినే మందు మాత్రల్లోకూడా కల్తీ! కల్తీ తిండి తినేవాళ్ళకు కాక మరెవ్వరికిరా జబ్బు వస్తూంది?" ఈలోగా సర్వర్ తెచ్చి పెట్టిన టీని కొంచెం చప్పరించాను. టీ బ్రతుకంత చేదుగా నోటికి తగిలింది. ఇక పుచ్చుకో బుద్ధి పుట్టక, సావకాశంగా కుర్చీలోంచి అటు వేపు తిరిగి, మాట్లాడుకుంటున్న నలుగురు మిత్రుల వేపు చూస్తూ కూర్చున్నాను.

"ఆ రోజుల్లో ఈ అరచేతిలో ఒక అణా, ఈ అరచేతిలో మరో అణా పెట్టుకొని వెళ్ళామంటే ఎర్రటి దోసె, రెండు సార్లు పొంగలు, ఒక కప్పు కాఫీ— ఇవి చాలవా? తృప్తిగా ఇంటికి వెళ్ళే వాళ్ళం. మరి ఇప్పుడో!" చివర కూర్చున్న ఒకతను మెడను ముందుకు చాచి మి[illegible] ముందు మొరపెట్టుకున్నాడు.



కొండల నడుమ

ఫొటో—ఎస్. సంధ్యారాణి ( నెల్లూరు )

"అంత దూరం ఎందుకురా, వీర్రాజూ? మూడణాలు గాని పెట్టావంటే ఒక కాఫీపుంజి! తిన్నదియ్యా సాహెబుడ్ని పక్కను ఉంచుకున్నామంటే ఇక చెప్పాలా!" పాపయ్యగారు వీర్రాజుకి వత్తాసు పలికారు. ఈ మాటలు చెప్తు తున్నప్పుడు పాపయ్యగారి కళ్ళు ఆరో వింత కాంతితో మెరవడం గమనించాను. ముఖంలో అస్పష్టంగా కాలం గీసిన గీతలు మరింత కుంచించుకుపోయి, బాధ ఛాయగా గోచరించాయి.

"నువ్వు చెపితే నమ్ముతావుగాని, పాపయ్యబావా! పొద్దుట నాస్తా ఇక్కడెక్కడా చేసేవాణ్ణి కాను. అరమైలు దూరం నడిచిపోయి వంతెన పక్కనున్న బ్రాహ్మణ హోటల్‌కి వెళ్ళి నాస్తా తీసుకునే వాణ్ణి! ఇంతకీ ఖర్చు ఎంతని— రెండణాలు!" ఇది చెప్పి పక్కున నవ్వాడు మరొకతను. గతాన్ని తలుచుకుని అతడు పడుతున్న సంబరం చూసి నేను చిన్నగా నవ్వాను. నేను నవ్వడం చూశారు కాబోలు పాపయ్యగారు నా వేపు తిరిగి నన్ను ఉద్దేశించి ఇలా అన్నారు:

"మా మాటలు నీకు నవ్వు పుట్టిస్తున్నాయి కదూ? అవును! ఈ కాలపు కుర్రాళ్ళకు మా మాటలు వింతగానే ఉంటాయి." నేను చటుక్కున ఆయన మాటలకు అడ్డు తగిలాను.

"నేను నిజం చెపుతున్నాను—మీ మాటలు వింటూంటే నాకు చాలా సంతోషంగా ఉంది" అని నచ్చచెప్పాను.

"నువ్వు నమ్మూ, నమ్మకపో! మేమన్నదంతా నిజం! ఆ నిజాన్ని నిరూపిస్తారా అని మమ్మల్ని అడిగితే నేను ఒక్కటే చెప్పగలను. మే మందరం అప్పటివాళ్ళం! మీరందరూ ఇప్పటి కుర్రాళ్ళు! అయినా, వయసు మళ్ళిపోయిన తరవాతకూడా మిల్లువారు మమ్మల్ని రమ్మంటున్నారు. కాని, మిమ్మల్ని అంతలోలొందరగా పిలవడం లేదు. కారణం ఏమిటో తెలుసా? మా వయసులో మేం తిన్న తిండి అటువంటిది! ఇప్పటిలా ఆ తిండిలో కొంచెంకూడా కల్తీ ఉండేది కాదు. అందువల్లే మా నడుములు ఇంతవరకూ వంగలేదు" అని పాపయ్యగారు చటుక్కున లేచి ఆయన నడుం నాకు చూపించారు. ఆయన మాటలు నాకు కొంచెంకూడా బాధ కలిగించడం లేదు. ఎందుకంటే, ఆయన చెప్పేదంతా సత్యం! పాపయ్యగారు బదులు కోసం నా ముఖంలోకి తేరిపార చూడ్డం గమనించి, నేను అంగీకార సూచకంగా మందహాసం చేశాను. పాపయ్యగారు నా మందహాసంతో కొంచెం శాంతించి మళ్ళీ కూర్చున్నారు.

"ఈకాలపు కుర్రాళ్ళను చూస్తూంటే నాకు జాలి వేస్తుంది. కొంచెం వాన చినుకు పడకూడదు జ్వరం బాబో అని డాక్టర్ దగ్గరకు పరుగెత్తుతారు. మిమ్మల్ని నిందించి ప్రయోజనం లేదు. మీా కున్న శక్తి అంతే! ఎంత చెట్టుకి అంత గాలి — ఎంత పంటి చెండికి అంత శక్తి!" ముసలాయన వ్యాఖ్యానం విని గట్టిగా నవ్వాను.

"మా వయసులో నే నున్నప్పుడు బియ్యం బస్తాను ఒక్కణ్ణే పైపంతాలకు తెచ్చుకునేవాణ్ణి! కాని, నా కొడుకు ఉన్నాడు చూశావూ — వారం రోజులు మిల్లుకి వస్తే మరో వారం రోజులు మెడికల్ లీవు పెడతాడు. ఇంతకీ వాడికి పెళ్ళి కాలేదు." ఈ సారి ఆయన మిత్రులు అందరూ గొల్లున నవ్వారు. వాళ్ళలా ముక్త కంఠంతో నవ్వేటప్పుడు 'గోవిందా' అని అరిచినట్టు చెవులకు వినిపించింది.

"ఊరు ఇలా తగలడ్డందుకు మరొక ముఖ్య కారణం ఉంది. రాను రాను మనుష్యుల్లో మంచితనం తగ్గిపోతూంది. వాళ్ళ మనసుల్లో దయకు చోటు లేకుండా పోయింది. అందుకే దేవుడికికూడా మన మీాద కరుణ లేకుండా పోయింది. ఆ రోజుల్లో, ఈ వీధిలో ఎవరికీ చెందని ములగచెట్టు ఒకటుండేదనుకో! దానికి పది ములగకాడ లున్నాయనుకో! ఆ చెట్టుకి పక్కనే మా ఇల్లు ఉన్నాసరే, నేను ఆ పది కాడలూ తెంపుకొని పోను. రెండు మాత్రం కోసుకుంటాను. ఆ పది నేను తినలేక కాదు. ఇరుగు పొరుగువారుకూడా తింటారని ఆలోచించే అలా వదిలి వేయడం. మరి ఇప్పుడో? చెట్టునే పెకలించుకుని పోతారు." ఈ సారి ఆయన మిత్రులు మరింత గట్టిగా నవ్వారు. నేను నవ్వలేదు. ఈ మాట నా గుండెకు సూటిగా తగిలింది. ఆ మాటలోని భావం నా హృదయపు లోతుల్ని తాకింది. మంచినీళ్ళు మాత్రం కొంచెం తాగి లేచి నిలుచున్నాను. కప్పు టీ అలాగేపడి ఉంది. బిల్లు చెల్లించి వెనక్కి తిరిగి చూశాను. ఆ నలుగురు వృద్ధులూ ఇంకా మాట్లాడుకుంటూనే ఉన్నారు. వాళ్ళు మనసులు విప్పి, హృదయభారాన్ని పరిచయంగా పంచుకుంటున్నారు. మధురమైన గతాన్ని పదేపదే తలుచుకుంటూ, భవిష్యత్తు కాకి మళ్ళీ మళ్ళీ మసి పూస్తూ, వాళ్ళు ఇంకా అలాగే కూర్చున్నారు. స్పష్టంగా చెప్పాలంటే, ఆ నలుగురు మిత్రులూ ప్రస్తుత ప్రపంచంలో జీవించడం లేదు. ఇక జీవించలేరనుకుంటాను. చివరి క్షణాలవరకూ పాతకాలపు రోజుల్ని తలుచుకునే కాలం వెళ్ళబుచ్చుతారు. దేశంలో నిర్మితమైన పెద్ద పెద్ద కర్మాగారాలతో వాళ్ళకు నిమిత్తం లేదు. దేశం నిర్మిస్తున్న పెద్ద పెద్ద యుద్ధ నౌకలతో వాళ్ళు కొంచెంకూడా తృప్తిచెందరు. అత్యాధునికమైన జలాంతర్గాములను చూచి ముచ్చటపడరు. వాళ్ళకు కావలసిందల్లా మంచి తిండి! అది చాలా చౌకగా దొరకాలి. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త సి. వి. రామన్ ఫలానాది సాధించాడని వీళ్ళతో ప్రస్తావిస్తే, "అదెందుకూ?" అని గుచ్చి చూస్తారు.

కొద్ది దూరం నడిచిన తరవాత రోడ్డువారను, ఒళ్ళమ్మనుకూడా కప్పలేని చాలీచాలని గుడ్డతో ఒక బిచ్చగత్తె పడి ఉండడం చూసి ఆగాను. సర్వసాధారణంగా బిచ్చగాళ్ళకు పైసలిచ్చే అలవాటు నాకు లేదు. ముఖ్యంగా దారిపొడుగునా కనిపించే వారందరికీ ఇచ్చే శక్తికూడా లేదు. ఎందుకంటే, ఎంత చెట్టుకి అంత గాలి! అయితే, ఈ సారి నా మనసు ఊరుకోలేదు. పైకి పొడుచుకు వస్తూన్న ఆమె ఎముకల్ని చూసి నా హృదయం కరిగింది. పాంటుజేబులో చేయి పోనిచ్చి ఒక పావలా కాసుని బయటకు తీశాను. అంతలో ఒకతను గబగబా పరుగెత్తుకొచ్చి, సెంకుపాత్ర ను ఒకటి నా ముందు చాచాడు. అతణ్ణి లక్ష్య పెట్టకుండానే బిచ్చగత్తె చేతిలో పావలాకాసు ఉంచేందుకు దాన్ని కిందికు వంగాను. "దానికి పేణం లేదు, బాబుగారూ! దాని పాడె కట్టడానికి ఇది" అని ముఖం దగ్గరగా తెచ్చాడు సెంకుపాత్రను. నేను మాట్లాడకుండా ఆ సెంకుపాత్రలో పావలా కాసుని పడవేసి ముందుకు సాగిపోయాను.

* * *

ఆ రోజుల్లో పొద్దుటే లేచి మా అమ్మ నుదుట ఎర్రటి కుంకుమబొట్టు పెట్టుకుంటూ ఉండేది. పెందలకడే స్నానం ముగించి నాకు, మా అక్కయ్యకు స్నానం చేయించి గుడికి తీసుకువెళ్ళేది. ఇంట్లోకి ఎప్పుడు వెళ్ళినా, ఎప్పుడూ చెదరని చిరునవ్వుతో ఇంటిపనులు చేస్తూ ఉండేది. ఎంత ఆలస్యమయినా నాన్నగారు రానంతవరకూ అన్నం ముందు కూర్చునేది కాదు. అటువంటి అమ్మ ఇప్పుడు ఏం చేస్తూంది? క్యాన్సర్‌వార్డులో మరణశయ్యపై సావకాశంగా ఆమెను రాలయి మృత్యువు ముఖంలోకి దీనంగా చూస్తూంది. అప్పుడప్పుడు నేను వచ్చానో లేదోనని నడవమ్మట చూపులు సారిస్తుంటుంది. కాని, నేను అమ్మ దగ్గరకు వెళ్ళను. వెళ్ళి ఏం చెప్పను?

"కాలేజీకి వెళ్ళడం మానేశా"నని నవ్వుతూ అమ్మ పక్కన కూర్చోనా! విపరీతమైన మానసిక ఘర్షణతో బ్లడ్‌ప్రెషర్ అధికమై నాన్నగారు హాస్పిటల్‌లో మరణించారన్న చల్లని కబురు అందజేయనా! వీల్లేదు. నే నేదీ చెప్పలేను. అందుకే మరి నేను అమ్మ దగ్గరకు వెళ్ళను. ★

